- మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లాల్లో సోదాలు
- ఏకకాలంలో పలుచోట్ల దాడులు చేసిన అధికారులు
- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో లావాదేవీలపై ఆరా
- పూర్తి వివరాలు అధికారికంగా వెల్లడిస్తామని ప్రకటన

# ఐటీ దాడుల కలకలం



ఆసిఫాబాద్: ప్రముఖ పారిశ్రామిక వేత్త నివాసం వద్ద ఐటీ దాడుల నేపథ్యంలో పోలీస్ బందోబస్తు

మంచిర్యాల, నవంబర్ 21 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): రాష్ట్ర వ్యాప్తంగా మంగళవారం ఆదాయ పన్ను శాఖ అధికారులు చేసిన దాడులు హాట్‌టాపిక్‌గా మారాయి. మంచిర్యాల, కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రాలతో పాటు పలు చోట్ల దాడులు జరిగాయి. ఇటీవల బీజేపీ నుంచి కాంగ్రెస్‌లో చేరి చెన్నూర్ కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం వివేక్ వెంకటస్వామి మంచిర్యాల ఇంటితో పాటు హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో ఐటీ అధికారులు ఏకకాలంలో దాడులు చేశారు. మంగళవారం ఉదయాన్నే మంచిర్యాలలోని వివేక్ నివాసానికి అధికారులు చేరుకొని బయట వారిని ఎవ్వరిని లోపలికి అనుమతించకుండా సోదాలు చేశారు. ఈ విషయం తెలుసుకున్న కాంగ్రెస్ శ్రేణులు వివేక్ నివాసానికి క్యూ కట్టారు. ఇంటి ముందు కూర్చొని నిరసన తెలిపారు. దీంతో కాసేపు ఉద్రిక్త పరిస్థితులు నెలకొనగా పోలీసులు వారిని చెదరకొట్టి పంపించారు. సాయంత్రం వరకు సోదాలు కొనసాగాయి. బెల్లంపల్లి నియోజకవర్గం తాండూర్ మండలం రేపల్లెవాడ మహాలక్ష్మి జిన్నింగ్ మిల్లులోనూ ఐటీ దాడులు నిర్వహించారు. అలాగే కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని వ్యాపారవేత్త రఫిక్ జవాని నివాసంలోనూ సోదాలు జరిగాయి. రెబ్బన మండలం కాగజ్‌నగర్ క్రాస్‌రోడ్డులోని శ్రీనిధి కాటన్ మిల్లు, కాగజ్‌నగర్ కాటన్ మిల్లుతో పాటు కాగజ్‌నగర్‌లో ఈ మిల్లుల యాజమానుల ఇండ్లలోనూ సోదాలు నిర్వహించారు. ఎన్నికల కోడ్ అమలు నేపథ్యంలో బ్యాంకుల నుంచి అధికంగా డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేసిన సంస్థలు, మిల్లులు, వ్యాపారుల ఇండ్లలో సోదాలు నిర్వహించినట్లు తెలిసింది. ఈ మధ్య కాలంలో జరిగిన డబ్బు లావాదేవీలు, ఇతర లెక్కలు అన్నింటిపైనా ఆరా తీసినట్లు తెలిసింది. కాకపోతే ఎక్కడ ఏం జరిగింది. డబ్బులు ఏమైనా దొరికాయా.. ఎంత దొరికాయి.. అనే విషయాలు ఏం వెల్లడించలేదు. అధికారిక ప్రకటన వస్తుందని అధికారులు తెలిపారు.

**కాటన్ మిల్లులో ..**

తాండూర్, నవంబర్ 21 : తాండూర్‌లోని రేపల్లెవాడ సమీపంలోని మహేశ్వరి జిన్నింగ్ మిల్లులో ఐటీ అధికారులు సీఐఎస్ఎఫ్ భద్రత దళాలతో కలిసి మంగళవారం ఉదయం 6 గంటల నుంచి సోదాలు ప్రారంభించారు. మిల్లులోనికి ఎవరిని వెళ్లకుండా చేసి రికార్డులు ,లావాదేవీలను పరిశీలించారు . మిల్లు యజమానులు ఎవరూ అందుబాటులో లేరు. ఆ సమయంలో మిల్లులో పని చేస్తున్న సూపర్‌వైజర్, ఇతర సిబ్బంది నుంచి సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకొని సోదాలు చేశారు. దాదాపు 6 ,7 గంటల పాటు సుదీర్ఘంగా ఈ తనిఖీలు జరగడం మండలంలో కలకలం రేపింది. ఐటీ అధికారుల సోదాల గురించి తెలిసి బెల్లంపల్లి ఏసీపీ సదయ్య, తాండూర్ సీఐ శ్రీనివాసరావు, మాదారం తాండూర్ ఎస్ఐలు అశోక్, రాజశేఖర్ అక్కడికి చేరుకొని వివరాలు సేకరించారు. అయితే ఐటీ అధికారుల సోదాలతో మిల్లు యాజమాన్యం పత్తి కొనుగోలు చేయకపోవడంతో రైతులు ఇబ్బందికి గురయ్యారు సాయంత్రం వరకు వేచి చూసి తిరిగి వెళ్లారు. ఐటీ దాడుల పూర్తి వివరాలు అధికారులు వెల్లడించాల్సి ఉంది.

**కాగజ్‌నగర్‌లో..**

కాగజ్‌నగర్, నవంబర్ 21: కాగజ్‌నగర్‌లోని బాలాజీనగర్‌కు చెందిన మార్కెట్ కమిటీ చైర్మన్ కాసం శ్రీనివాస్, చిలువేరు మార్గ్‌లోని ప్రముఖ వ్యాపార వేత్త చిలువేరు గంగాధర్ ఇళ్లలో ఐటీ సోదాలు మంగళవారం జరిగాయి. బ్యాంకు లావాదేవీల విషయంలో వారిని బ్యాంకుకు తీసుకెళ్లి అక్కడి లాకర్, లావాదేవీల వివరాలు సైతం తెలుసుకున్నట్లు తెలుస్తుంది. వేకువ జాము నుంచి రాత్రి వరకు ఐటి అధికారుల సోదాలతో కాగజ్‌నగర్ పట్టణంలో కలకలం రేపింది. గతంలో ఈ ప్రాంతంలో ఐటీ అధికారలు దాడులు చేసిన దాఖలాలు లేవు, ప్రస్తుతం నిర్వహించిన దాడుల్లో కాగజ్‌నగర్‌లోని వ్యాపారులందరు అప్రమత్తమైనట్లు తెలుస్తుంది. ఐటీ అధికారలు మరో రెండు, మూడు రోజులు కాగజ్‌నగర్‌లో ఉండనున్నట్లు తెలుస్తుంది. ఐటీ అధికారులు దాడుల సంబంధించిన వివరాలు రిపోర్టర్లు ప్రశ్నించగా వివరాలు తెలియజేయాడానికి నిరాకరించారు. సోదాల్లో వ్యాపారులకు సంబంధించిన పూర్తి దస్త్రాలతో పాటు సమాచారాన్ని సేకరిస్తున్నట్లు తెలుస్తుంది.

రెబ్బెన, నవంబర్ 21: రెబ్బెన మండలం లోని కాగజ్‌నగర్ ఎక్స్‌రోడ్ ప్రాంతంలో గల శ్రీనిధి జిన్నింగ్ మిల్లు, కాగజ్‌నగర్ కాటన్ మిల్లులో ఐటీ శాఖ ఆధికారులు సోదాలు నిర్వహించడంతో చర్చనీయ అంశంగా మారింది. మిల్లుకు పత్తి విక్రయించడం కోసం వచ్చిన రైతులతో పాటు కూలీలను మిల్లులోకి రాకుండా ప్రత్యేక బలగాలు నిరోధించారు. రెండు మిల్లులలో రికార్డులు పరిశీలించడంతో పాటు బ్యాంకు లావాదేవీలా వివరాలు సేకరించినట్లు సమచారం. ఉదయం ప్రారంభమైన ఐటీ ఆధికారుల సోదాలు రాత్రి వరకు కొనసాగుతునే ఉన్నాయి.

ఆసిఫాబాద్, నవంబర్ 21 : ఆసిఫాబాద్‌లోని ప్రముఖ పారిశ్రామిక వేత్త, బీఆర్ఎస్ నేత రఫిక్ జవాని ఇంట్లో ఐటీ దాడులు జరిగాయి. మంగళవారం ఉదయం దాదాపుగా 5 గంటల ప్రాంతం నుంచి రఫిక్ జవాని నివాసంతో పాటు వారి వ్యాపార సంస్థల్లో, జిన్నింగ్ మిల్లు, సిబ్బంది నివాసల్లో దాడులు నిర్వహించారు. ఐటీ దాడుల నేపథ్యంలో జిల్లాలో కలకలం సృష్టించాయి. ఐటీ అధికారులు రఫిక్ జవానికి సంబంధించిన డబ్బుల వివరాలు, వ్యాపార లావాదేవీలు, ల్యాండ్స్ పత్రాలు, నగలు ఇతరత్ర వాటి వివరాలు సేకరించారు. భారీ మొత్తంలో నగదు స్వాధీనం చేసుకొని సీజ్ చేసినట్లు సమాచారం.

# శ్యాంనాయక్‌కు ఎదురీత



కాంగ్రెస్ అభ్యర్థిని పంపించాలంటూ పోలీసులతో వాగ్వాదానికి దిగిన బీఆర్ఎస్ నాయకులు

ఆసిఫాబాద్, నవంబర్ 21 : కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని సందీప్‌నగర్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ఆజ్మీరా శ్యాంనాయక్ నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వంచడంపై స్థానికులు, బీఆర్ఎస్ మద్దతుదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం రాత్రి 11 గంటలకు కాలనీలో ప్రచారం నిర్వహించవద్దని యువకులు రోడ్డుకు అడ్డంగా బైక్‌లు పెట్టడంతో కాంగ్రెస్ నాయకులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్కడి చేరుకున్న పోలీసులు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన అభ్యర్థిని పంపించాల్సింది పోయి.. బీఆర్ఎస్ మద్దతుదారులు,కాలనీవాసులపై లాఠీలు ఝుళిపించారు. దీంతో వారు ఆందోళనకు దిగారు. పోలీసులు ఏకపక్షంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా ప్రచారం నిర్వహించిన కాంగ్రెస్ అభ్యర్థి శ్యాంనాయక్‌పై చర్యలు తీసుకోవాలని ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. దీంతో ఎన్నికల అధికారులు ఘటనా స్థలానికి చేరుకొని అక్కడి ప్రజలతో వివరాలను సేకరించారు. కాగా, కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్ ఓటమి భయంతోనే రెచ్చగొట్టుతున్నారన్న అభిప్రాయం వ్యక్తం అవుతుంది.

# ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రారంభం

భీమారం, నవంబర్ 21 : బూర్గుపల్లి గ్రామంలో డీసీఎంఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని నిర్వాహకులు భూక్యా రాజు నాయక్ రైతులతో కలిసి ప్రారంభించారు. కార్యక్రమంలో రైతులు బలరాం నాయక్, దేవ్ నాయక్, పేదం భీమాయ్య, రాజేశ్ నాయక్, గూగ్లోత్ మధునయ్య, అర్ష మధుకర్, పేదం దుర్గయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయండి

సీసీసీ నస్పూర్, నవంబర్ 21 : మంచిర్యాల నియోజకవర్గంలో ఈ నెల 24వ తేదీన నిర్వహించే సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని పెద్దపల్లి ఎంపీ బొర్లకుంట వెంకటేశ్ నేతకాని, ఎమ్మెల్యే అభ్యర్థి నడిపెల్లి దివాకర్‌రావు పిలుపునిచ్చారు. నస్పూర్‌లో కలెక్టరేట్ సమీపంలో ఏర్పాటు చేస్తున్న సభాస్థలాన్ని మంగళవారం వారు పరిశీలించి, ఏర్పాట్లపై చర్చించారు. అనంతరం వారు మాట్లాడుతూ మంచిర్యాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇప్పటికే నియోజకవర్గంలో కార్యకర్తలు ఇంటింటికీ తిరిగి ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారని, ప్రజల నుంచి బీఆర్ఎస్‌కు మంచి స్పందన లభిస్తుందన్నారు. 24న నిర్వహించే ప్రజా ఆశీర్వాద సభకు పెద్ద సంఖ్యలో ప్రజలను తరలించడం జరుగుతుందన్నారు. కార్యకర్తలు సభను విజయవంతం చేయడానికి కృషి చేయాలని కోరారు. నియోజకవర్గంలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని, సంక్షేమ పథకాలను ప్రజల వద్దకు చేరవేయడం జరిగిందని వివరించారు. బీఆర్ఎస్‌ను గెలిపిస్తే నియోజకవర్గంలో మరింత అభివృద్ధి జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ ఈసంపల్లి ప్రభాకర్, నాయకులు కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, డీకొండ అన్నయ్య, ఏనుగు రవీందర్‌రెడ్డి, గొంగళ్ల శంకర్, కాశీరావు, సయ్యద్ ఖాసీం, బోడ ధర్మేందర్, చెల్ల విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.



నస్పూర్‌లో ఏర్పాటు చేయనున్న సభాస్థలాన్ని పరిశీలిస్తున్న పెద్దపల్లి ఎంపీ వెంకటేశ్ నేతకాని, మంచిర్యాల ఎమ్మెల్యే అభ్యర్థి దివాకర్‌రావు

నమస్తే తెలంగాణ CLASSIFIED
WANTED
jobs Apply Now!
★ రామకృష్ణ గ్రూప్ (TS No. 1) Hyd. శ్రీమంతుల ఇండ్లలో వృద్ధులకు/పేషెంట్ల సేవకు, వంట/ఇంటి పని, బేబీకేర్ కొరకు M/F వర్కర్లు కావలెను. భో+వ+జీతం: 15-21 వేలు. ఏజెంట్లకు 5 వేలు కమీషన్. తెలంగాణ అంతటా వర్కర్లను మీ ఇంటికి పంపగలము. Ph: 9618802390, 9912611122.
NT-314452

CHANGE OF NAME
I Tulsyan Neethi D/o. Sanjay Kumar Tulsyan R/o.H.No. 7-1-19, Street No.3, Dwarakanagar, Adilabad is here by Declare that Hence change my name as **"TULSYAN NEETI"** Holding Passport No.K4182439 Dt.31-07-2012 to 30-07-2017 issued at Hyderabad Hence Declared.

CHANGE OF NAME
★I " GADDADI RAMBABU S/O VENKANNA GADDADI " (Old name) R/o. 23-108/3, Chunnambattiwada, Mancherial, Mancherial Dist. I have Changed my name as GEDDADI RAM BABU S/O GEDDADI VENKANNA, (New Name)
NTK-517392

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన
నమస్తే తెలంగాణ
క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం
200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి
50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677